**కథ**

**ప్రపంచం చాలా అందమైనది. ప్రేమలూ, అనుబంధాలూ ఒకరి మనసులోంచీ ఇంకొకరి మనసులోకి పూలతీగల్లా అల్లుకుపోయి వుంటాయి. నీకోసం నేనున్నాననే భావన మనసుని బలపరిచి నైతికతని అలవరుస్తుంది.**

# సార్వభౌముడు

ప్రపంచం చాలా చాలా అందమైనది. కానీ అందులో వుండే మనిషే దాన్ని ధ్వంసం చేస్తున్నాడు. నీకోసం ఎవరూ లేరనే భావనని సృజించి, పూలతీగల్లా అల్లిబిల్లిగా ఒకరినుంచీ ఇంకొకరికి అల్లుకోవలసిన అనుబంధాలని తుంచేసి, ఎడారిగా మారుస్తున్నాడు.

★ ★ ★

నాన్నెక్కడ?

ఈ ప్రశ్న నాలుగేళ్ళ సిద్ధూని గత కొద్దిరోజులుగా బాధపెడుతోంది. వాడిలో ఒక వెతుకులాట మొదలైంది.

పిల్లిలాంటి మెత్తటి అడుగుల చప్పుడు విని ఫైల్లోంచి తలెత్తాడు రాఘవరావు. అప్పటికే లోపలి దాకా వచ్చి, టేబుల్ అంచు పట్టుకుని కుర్చీలోకి ఎక్కడానికి ప్రయత్నిస్తున్నాడు మనవడు సిద్ధూ.

''ఏంట్రా?'' ఫైలు పక్కనపెట్టి ఆప్యాయంగా అడిగాడు రాఘవేంద్రరావు.

''డాడీకి ఫోన్ చెయ్యాలి'' అన్నాడు సీరియస్‌గా.

చిన్న నిట్టూర్పొకటి రాఘవరావు గొంతులోంచి వెలువడింది.

అతనికిద్దరు కూతుళ్ళు. చిన్నకూతురూ, అల్లుడూ ముంబైలో వుంటారు. పెద్దల్లుడు ఈ మధ్యే అమెరికా వెళ్ళాడు. కూతురొచ్చి ఇక్కడ వుంటోంది, తనకీ, సిద్ధూకీ వీసా వచ్చేదాకా విడిగా ఎందుకని.

పల్చటి ఎర్రటి పెదాలు, చురుకైన కళ్ళు, ప్రస్ఫుటంగా కనిపించే చెవులు... చాలా క్యూట్‌గా వుంటాడు సిద్ధూ.

తండ్రి ఇండియాలో వున్నప్పుడు రెండుసార్లు ఐక్యూ టెస్టుల్లో పాల్గొని సూపర్‌కిడ్ ప్రైజు తెచ్చుకున్నాడు. ఒక యాడ్‌ఫిల్మ్‌లో కూడా యాక్ట్ చేసాడు. కంప్యూటర్ని ఆన్ చెయ్యటం, ఆఫ్ చెయ్యటం రెండేళ్ళ వయసునుంచే వాడికి తెలుసు. తండ్రి ఒళ్ళో కూర్చోబెట్టుకుని అన్నీ నేర్పేవాడు. ఎక్కడికెళ్ళినా ఏం చేసినా ఇద్దరూ కలిసే చేసేవారు.

సిద్ధూ తండ్రి ఉదయ్.

అతను ఇండియాలో వున్నప్పుడు బెంగుళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్ చేసేవాడు. అతని ఆఫీసులోకి సిద్ధూకి కూడా ప్రవేశం వుండేది. అతనో సిస్టంమీద వర్క్ చేసుకుంటుంటే సిద్ధూ మరోదాని మీద గేమ్స్ ఆడుకునేవాడు. యానిమేషన్ పిక్చర్స్, కామిక్ ఫిల్మ్స్ చూసేవాడు.

ఉదయ్ కొలీగ్స్ వాడిని రకరకాల ప్రశ్నలు వేసి, వాడిచ్చే జవాబులకి ఆశ్చర్యపోయేవారు.

రెండున్నరేళ్ళకి సిద్ధూని ప్రీ నర్సరీలో వేసారు. తెల్లగా బొద్దుగా చురుగ్గా వుండేవాడేమో స్కూల్లో ఆకర్షణ వీడే.

అలాంటి పిల్లవాడు తండ్రి అమెరికా వెళ్ళడంతో తల్లితో ఇక్కడికొచ్చాడు. అప్పటిదాకా తండ్రికి నీడలా వుండేవాడు. ఇప్పుడు తండ్రి కనిపించకపోవటంతో సర్వం కోల్పోయినట్టు అతనికోసం వెతుకులాడుతూ తన ఆఫీసులోనూ ఇంట్లోనూ తిరుగుతూంటే రాఘవరావుకి గుండెకోతగా వుంటోంది.

అప్పటిదాకా కిలకిలా నవ్వుతూ అల్లరిచేస్తున్నవాడల్లా సడెన్‌గా గుర్తొచ్చినట్టు-

''నాన్నేడి?'' అనడిగి,

''అమెరికా వెళ్ళాడు'' అనే జవాబు విని నిరాశగా చూస్తుంటే కళ్ళు మిరుమిట్లు గొలిపే వెలుతుర్లోంచీ చిమ్మచీకట్లోకి నెట్టివెయ్యబడిన వాడిలా కనిపిస్తాడు వాడతని కళ్ళకి.

ఎస్టీడీ లాక్ చేసి, ఫోను సిద్ధూ ముందుకి తోసాడు రాఘవరావు.

వాడు ఏవేవో నెంబర్లు నొక్కి- అవతల్నుంచీ ఎక్స్ఛేంజివాళ్ళ మెసేజి విని అర్థం కాక పెట్టేశాడు. రెండునిముషాలాగి రీ డయల్ బటన్ నొక్కి, మళ్ళీ అదే మెసేజి రావడంతో పెట్టేసాడు. నాలుగైదు సార్లలా చేసాక నిరుత్సాహంగా ఫోన్ దూరంగా నెట్టేసి, లేచాడు. రాఘవరావు చిన్నగా నిట్టూర్చాడు. సిద్ధూ డయల్ చేసిన నెంబరు బెంగుళూర్లోని వాళ్ళింటిదే. వాడికి తండ్రి అమెరికాలో వుండటానికీ, అతను బెంగుళూర్లో వున్నప్పుడు తల్లితో కలిసి తనిక్కడికి రావడానికీ గల తేడా పెద్దగా అర్థమవలేదు. ఆ ఎడబాటుని మాత్రమే సెన్స్ చేస్తున్నాడు.

సీట్లోంచీ లేచి వాడినెత్తుకుని ఇవతలికొచ్చాడు రాఘవరావు.

''తాతా!'' అన్నాడు రోడ్డుమీదికొచ్చాక.

''ఏంట్రా?''

''చాక్లెట్''

కొంచెం రొంపగా వున్నాడు. దగ్గుకూడా వస్తుందేమోననిపించినా, కాదంటే ఏడుస్తాడేమోనని కొనిచ్చాడు.

ఆఫీసునుంచీ ఐదునిముషాల నడక ఇంటికి. ఇల్లు చేరగానే సిద్ధూ తాత చేతుల్లోంచీ జారి లోపలికి పరిగెత్తాడు. వాడి అలికిడికి లోపల్నుంచీ రాఘవరావు భార్య వచ్చింది.

''పద్మేది?'' కూతురి గురించి అడిగాడు.

''తలనొప్పి అని పడుకుంది'' రాజ్యలక్ష్మి జవాబిచ్చింది.

''ఈవేళప్పుడు పడుకోవడమేమిటి? తలనొప్పి ఇంకా ఎక్కువవుతుంది. పిక్చర్‌కి వెళ్ళలేకపోయారా?''

''ఎన్ని సినిమాలని చూస్తాం? ఇంకా థియేటర్‌కి వెళ్ళేం చూస్తాం?''

''పోనీ అలా శివరావుగారింటికో, చంద్రసేన్ గారింటికో వెళ్ళాల్సింది. పద్మ ఫ్రెండ్స్ కూడా వుండాలిగా ఈ వూళ్ళో? నలుగురితో కలిస్తే కొంత దిగులు తగ్గి సరదాగా వుంటుంది''

కొద్దిసేపు ఏమీ మాట్లాడలేదు రాజ్యలక్ష్మి. తర్వాత నెమ్మదిగా అంది రాజ్యలక్ష్మి.

''అందరికీ ఈ అమెరికా పిచ్చి బాగా పట్టుకుంది. ఎక్కడికెళ్ళినా ఇదే గొడవ. మా వాడికి ముప్పైకే ఇస్తారు.. మావాడు అక్కడ సిస్టమ్స్ ఎనలిస్ట్.. వెళ్ళగానే జాబ్ దొరికింది.. అని వాళ్ళగురించైనా చెప్పుకుంటారు. లేకపోతే మీ ఉదయ్‌కింకా ప్లేస్‌మెంట్ దొరకలేదా? మరక్కడేం చేస్తున్నాడు? ఎందుకట అక్కడుండటం. తిరిగొచ్చేస్తాడటనా? అని గుచ్చి గుచ్చి మనగురించైనా అడుగుతారు. ప్రస్తుతం మనం వున్న పరిస్థితిలో రెండింటిలో దేన్నీ తట్టుకోలేం''

రాఘవరావు సుదీర్ఘంగా నిశ్వసించారు.

''పద్మనీ, సిద్ధూనీ చూస్తుంటే బాధేస్తోందండీ. ఇద్దరికిద్దరూ అతని కోసం బెంగపెట్టుకున్నారు'' అంది రాజ్యలక్ష్మి తనే మళ్ళీ.

తన ఆలోచనలకి బలం చేకూరినట్లైంది రాఘవరావుకి.

''నువ్వు చెప్పు లక్ష్మీ! ఇప్పుడతనికి అమెరికా వెళ్ళి సంపాదించుకు రావాల్సిన అవసరమేంటో? మనకి పాతికలక్షలకి పైగా వుంది. ఫైనాన్స్ కంపెనీ మంచి స్థితిలో వుంది. మన తర్వాత అదంతా పిల్ల

లకేనా? అటు అతని తండ్రింకా సర్వీసులో వున్నాడు. సంపాదించి పెడ్తున్నాడు. ఇరవైవేల జీత మొచ్చే ఉద్యోగం వదులుకుని ఎందుకెళ్ళినట్టు? ఇక్కడ లేనిదేమిటి? అక్కడున్నదేమిటి? అంతగా చూడాలనుకుంటే విజిటింగ్ వీసా తీసుకుని వెళ్ళొస్తే సరిపోయేది'' తన ఆవేదనంతా వ్యక్తపరి చాడు.

''గట్టిగా అనకండి. పద్మ వింటే బాధపడు తుంది'' అంది రాజ్యలక్ష్మి.

ఆమెకీ అలాగే వుంది. అందర్నీ ఒకేలా బాధపెడు తున్న విషయం, ఉదయ్‌ని తీసుకెళ్ళిన కన్సల్టెన్సీ మూతపడింది. ఇక్కడి జాబ్ వదిలేసి స్వంత రిస్క్‌మీద అక్కడికెళ్ళిన అతనికిప్పుడు జాబ్ లేదు. ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో తెలీదు. ఫ్రెండ్స్ దగ్గరుంటున్నానని చెప్పాడు గానీ వివరాలు తెలీవు. ఫోన్ చేసినా అతనే చెయ్యాలి.

ఇంతలో పద్మ గదిలోంచి వచ్చింది. ఎర్రగా వుబ్బి వున్న ఆమె ముఖం చూస్తుంటేనే ఇద్దరికీ అర్థ మైంది.. చాలాసేపు ఏడ్చిందని.

''ఏంటి పద్మా ఇది? అతనేమైనా అడవులుపట్టి పోయాడా? చూద్దాం. ఫ్రెండ్స్ దగ్గరున్నానని చెప్పాడా? తిరిగొచ్చెయ్యమని చెప్పాం. వచ్చేస్తా డేమో. అక్కడ అతని ప్రయత్నాలేమిటో? నువ్వే ఇలా దిగులుపడ్తే సిద్ధూగాడికెలా వుంటుంది? ఎప్పుడూ తండ్రిని వదిలిపెట్టి వున్నవాడు కాదు. వాడిని ఛీరప్ చెయ్యాల్సిందిపోయి?'' అని కోప్పడి.

''పోనీ, ముంబై టికెట్స్ బుక్ చెయ్యనా? అక్కడో నాలుగు రోజులుండి వద్దురుగాని... మార్పుగా వుంటుంది. రమ కూతుర్ని చూస్తే వీడికీ సరదాగా వుంటుంది?'' అనడిగాడు రాఘవ రావు.

''ఇప్పుడెక్కడికీ వెళ్ళాలని లేదు నాన్నా!'' ముక్త సరిగా జవాబిచ్చింది పద్మ.

భార్యాభర్తలిద్దరూ ముఖ ముఖాలు చూసుకు న్నారు. పద్మ తల దించుకుంది. తన పరిస్థితి తనకే ఆశ్చర్యంగా వుంది. ఇక్కడ తను పుట్టింది. ఇదే తనిల్లనే భావనతో ఇరవైరెండేళ్ళు పెరిగింది. అలాంటిది ఇప్పుడెందుకని ఇక్కడుండాలంటే సంకోచంగానూ, ఇబ్బందిగానూ అనిపిస్తోంది? పెళ్ళయ్యాక కూడా ఎన్నోసార్లు వచ్చిందిక్కడికి. వారమేసి రోజులు వుండి వెళ్ళేది. అప్పుడు కూడా హేపీగానే వుంది. కానీ ఈసారి మాత్రం అలా లేదంటే...? తనున్న అనిశ్చితి.. ఆశ నిరాశల మధ్య ఊగిసలాట.. అదే తనని బాధిస్తోందని గ్రహించాక కొద్దిగా సర్దుకుంది.

''ఉదయ్ ఫోన్ చేస్తే... నేను లేకపోతే హర్టౌ తాడు. అదీగాక మేం అక్కడికి వెళ్ళాలంటే ఎలాగా ముంబైమీంచే వెళ్ళాలి. అప్పుడెళ్ళి వుంటాం'' అని సర్దిచెప్పింది.

''సాయంత్రం ఎగ్జిబిషన్‌కి వెళ్దాం. మీరూ రాకూడదూ?'' అడిగింది రాజ్యలక్ష్మి మాట మారుస్తూ.


రాఘవరావు తలూపాడు. సిద్ధూ వచ్చేడక్క డికి.

''సాయంత్రం ఆచ్చి వెళ్దామా?'' వాడిని దగ్గరకు తీసుకుని అడిగింది పద్మ.

''మనింటికి వెళ్ళిపోదాం'' సీరియస్‌గా జవాబి చ్చాడు వాడు.

తన సమస్యకన్నా వాడి సమస్య పెద్దది. ఇది తను పుట్టిపెరిగిన వూరు, ఇల్లు. మనసులో ఆ కాస్త దిగులూ లేకపోతే ఇక్కడికి రావడం తనకెంతో ఉల్లాసాన్నిస్తుంది. కానీ సిద్ధూకి ఈ ఇంటితో ఎలాంటి ఎటాచ్‌మెంటూ లేదు. ఇంకా ఏర్పడ లేదు. తాతగారిల్లు. కొద్దిరోజులు రావటం మాత్రమే అనుభవం. ఇక్కడ వాడికి ఫ్రెండ్సెవరూ లేరు. స్కూలు లేదు. డాడీ, ఆఫీసు లేవు. వాడిని నవ్విస్తూ తిరిగే ప్రపంచమూ లేదు. ఇక్కడే వుండా లంటే వాడికి చిరాగ్గా వుంది. అదే సమయాన వాడికి అతి ముఖ్యమైన వ్యక్తీ కనిపించడం లేదు. ఈ రెండు సమస్యలనీ ఎదు ర్కోవడం వాడికి చాలా పెద్ద బాధ.

ఎగ్జిబిషన్ గురించి వూరించి చెప్పింది పద్మ. చాలాసేపటికి వాళ్ళతో వెళ్ళడానికి ఒప్పుకున్నాడు వాడు.



★ ★ ★

సాయంత్రం కార్లో బయల్దే రారు నలుగురూ. పద్మా, రాజ్యలక్ష్మి వెనక కూర్చుంటే తాత పక్కన ముందు సీట్లో కూర్చున్నాడు సిద్ధూ. స్టీరింగ్ తిప్పడాన్నీ, క్లచ్ నొక్కడాన్నీ, యాక్సిలే టర్ రెయిజ్ చెయ్య డాన్నీ వాడు గమని స్తుంటే రాఘవరావుకి అర్థ మైంది.. వాడికీ డ్రైవ్ చెయ్యాల నుందని. నవ్వొచ్చింది. అల్లు డైతే ఈ పాటికి నేర్పేవాడే.

''వేలెడు లేడు, వీడి బుర్రలో ఎన్ని ఆలోచనలో?'' అన్నాడు వెనక్కి తిరిగి నవ్వుతూ.

''ఏంటట?'' తనూ నవ్వుతూ అడిగింది రాజ్య లక్ష్మి.

''నన్ను లేవగొట్టి, ఇక్కడికి చేరదామని చూస్తు న్నాడు''

''ఇప్పటి పిల్లలకి పుట్టి సగం పుట్టక సగం తెలివి తేటలొస్తున్నాయి''

ఇంతలోనే ఎగ్జిబిషన్ చేరుకున్నారు. అంతమంది జనాన్నీ, ఆ లైట్లనీ, కోలాహలాన్నీ చూసాక సిద్ధూలో కొంత ఉత్సాహం మొదలైంది. తాత చెయ్యి పట్టుకుని చకచకా నడవడం ప్రారంభిం

**ఎస్.శ్రీదేవి**

చాడు. పెద్ద పెద్ద కళ్ళు చేసుకుని చూస్తూ అందులో లీనమైపోయాడు. ప్లేన్‌బొమ్మా, కోతి బొమ్మా కొనిచ్చాడు రాఘవరావు. షుగర్ కేండీ, పాప్‌కార్న్, బిస్కట్స్... ఏదడిగినా కాదనలేదు. 'పిల్లలు స్పాయిలయ్యేది ఇలానేకదా అనిపించింది కాసేపు. తండ్రి దగ్గరకు పంపించేదాకానే కదా!' అని సర్దుకున్నాడు.

## రాణి ఇష్టాలు

**'సినిమా వేరు జీవితం వేరు' అంటోంది రాణీముఖర్జీ. సినిమాల కోసం రకరకాల డిజైన్లున్న దుస్తుల్ని ధరించినంత మాత్రాన వాస్తవిక జీవితంలో కూడా అలాంటివే ధరించాలని లేదంటోంది. 'ఏ దుస్తులు ధరించినా మనకి కంఫర్టబుల్‌గా ఉండాలి. ఫ్యాషన్ దుస్తులంటే నాకంత ఇంట్రెస్ట్ లేదు. ఏదో నా ఇమేజ్‌కి తగినట్టుగా నా లైఫ్ స్టయిల్ ఉంటుంది. ఇప్పుడు ఫ్యాషన్ ట్రెండ్ మారిపోయింది. అందరుతారలూ ఫ్యాషన్‌దుస్తులకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. జీన్స్ వేసుకున్నా, టీషర్ట్‌లు ధరించినా, శారీలో కన్పించినా మన వ్యక్తిత్వం పెరగాలి గానీ తగ్గకూడదు' అని చిన్నసైజ్ లెక్చర్ ఇచ్చింది రాణీ.**

మెర్రీగోరౌండ్‌లో మనవడితో పాటు ఎక్కి కూర్చుంటే రాజ్యలక్ష్మి నవ్వింది. ''పేరు వీడిది.. సరదా మీకే ఎక్కువగా వుందే'' అని వెక్కిరించింది. ఆమె అలా అన్నందుకు మరో చోట వద్దంటున్నా ఆమెను ఎక్కించాడు.

''పద్మా! మనం జెయింట్‌వీల్ ఎక్కుదాం'' అన్నాడు కూతుర్తో. రాజ్యలక్ష్మికీ వాళ్ళ చిన్నకూతురికీ భయం. అందుకని ఎప్పుడూ వీళ్ళిద్దరే ఎక్కేవాళ్ళు. ఇప్పుడు పద్మతో సిద్ధూ తయారు.

''కళ్ళు తిరుగుతాయిరా!'' రాజ్యలక్ష్మి భయపడింది. అయినా వాడు వినలేదు. ఎక్కాక కొంచెం కూడా భయపడలేదు.

''వీడిదంతా నా పోలిక'' గర్వంగా అన్నాడు రాఘవరావు.

పద్మ నవ్వింది. జెయింట్ వీల్ సగంలో వుండగా సన్నగా తుంపర మొదలైంది.

''అయ్యో! తడిసిపోతాడేమో'' పద్మ సిద్ధూకి తన పైటకొంగు కప్పింది.

ఆపమన్నట్టు ఆపరేటర్‌కి సౌంజ్ఞ చేసి చెప్పాడు రాఘవరావు. రెండు నిముషాలకి పైనే పట్టింది అది ఆగి వీళ్ళు దిగటానికి. ఆ సరికి వాన బాగా పెద్దదైంది. ఎక్కడా షెల్టరన్నది లేదు. సిద్ధూనెత్తుకుని రాఘవరావు కారు దగ్గరకి పరిగెత్తాడు. వెనక పద్మా, రాజ్యలక్ష్మీ వచ్చారు. రాజ్యలక్ష్మి టవల్ తీసుకుని మనవడి తల గట్టిగా తుడిచింది. అసలే జలుబుగా వున్నాడేమో, వానలో తడిసేసరికి అది కాస్త ఎక్కువై వరసగా తుమ్ములొచ్చాయి వాడికి. దారిలో తెలిసిన పిల్లల డాక్టరుంటే ఆపి, వాడిని చూపించి, పక్కనే వున్న మెడికల్ షాపులో మందులు కూడా కొనుక్కుని వచ్చాడు రాఘవరావు.

★ ★ ★

ఆ రాత్రి నిద్రపోయేముందు తల్లినడిగాడు సిద్ధూ. ''నాన్న కావాలమ్మా'' అని.

పద్మ గుండెల్లో కలుక్కుమంది. వాడిని దగ్గరకు తీసుకుంది. ముద్దుపెట్టుకుంది. గుండెలమీద పడుకోబెట్టుకుని జోకొట్టింది. అమ్మ ఈ విషయంలో ఏమీ చెయ్యలేదని అర్థమైంది వాడికి.

అమెరికా గురించి ఎన్నో కబుర్లు చెప్పింది.



మనమే అక్కడికి వెళ్ళబోతున్నామని గట్టిగా అనలేకపోయింది. ఆమెకి తెలుసు, ఇంటిలిజెంట్ పిల్లల్ని హేండిల్ చెయ్యడం చాలా కష్టమని. వాళ్ళు గాజులాగా పెళుసుగా వుంటారు. ఏ మాత్రం తప్పుగా హేండిల్ చేసినా పరిణామాలు సంక్లిష్టంగా వుంటాయి.

మందులన్నీ వేసినా సిద్ధూకి మధ్యరాత్రికి సన్నగా జ్వరం మొదలైంది. అది వానలో తడవడం చేతనో, చాక్లెట్స్ తిన్నందుకో వచ్చిన జ్వరం కాదు. వాడి చిన్ని మనసులో వున్న గుబులు ఆ రకంగా బయట పడింది.

ఉదయాన్నే రాఘవరావు వాడిని మళ్ళీ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు. ఆయన అవే మందులు ఆరోజుకి వాడమనీ, తగ్గకపోతే మారుస్తాననీ చెప్పాడు. సాయంత్రానికి టెంపరేచరు పెరిగింది. డాక్టరు మందులు మార్చడంతోపాటు టెస్టులు రాసాడు. ఆరోజు అతికష్టమ్మీద గడిచింది. జ్వరం నూట మూడుకి చేరుకుని స్థిరంగా వుండిపోయింది.

హాస్పిటల్లో చేరిస్తే మంచిదన్నాడు డాక్టరు.

ఇంటిదగ్గరైతే ఉదయ్ దగ్గర్నుంచీ ఫోనొస్తే సిద్ధూని మాట్లాడించవచ్చింది పద్మ. మరో ఫోన్ కాల్ హాస్పిటల్‌కే చేయడానికి అతని దగ్గర డబ్బుంటుందో, ఉండదో...చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సిన విషయం.

ఇంట్లోనే ఉంచేట్టయితే చాలా జాగ్రత్తగా చూసుకోవాలని, మందులు టైం తప్పకుండా వెయ్యాలనీ చెప్పి ఏ టైంలోనైనా ఫోన్ చేస్తే వచ్చి చూస్తానని చెప్పి వెళ్ళాడు డాక్టరు.

వియ్యంకుడికి ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు రాఘవరావు. ఆయన అదుర్దాపడి భార్యతో కలిసి వెంటనే వస్తున్నానని చెప్పాడు. జ్వరతీవ్రతతో ఎర్రగా కందిపోయి, తెలివిలేకుండా మంచంలో ఉన్నాడు సిద్ధూ. రాత్రివేళ వాడి పెదాలు అస్పష్టంగా కదులుతుంటే ఏమిటో జాగ్రత్తగా వింది పద్మ. ''నాన్న...నాన్న...''

ఆమెకి ఏడుపొచ్చింది.

రాఘవరావుకైతే బాధ, కోపం రెండూ వచ్చాయి. ''అసలు పిల్లలంటే ఏమిటనుకుంటున్నారమ్మా. మీరు? ఆటబొమ్మల్లా మీకు ఆనందాన్ని ఇవ్వాలనుకుంటున్నారా? వాళ్ళెంత అనుబంధాన్ని పెంచుకుంటారో మీకేం తెలుసు. అమెరికా వెళ్ళే ఆలోచన అతనికి ఉన్నప్పుడు ముందునించే పిల్లవాడిని కొంచెం ఎడం చెయ్యక్కర్లేదా? ఇక్కడున్నంతకాలం వాడిని నెత్తిన పెట్టుకుని తిరిగాడు. ప్లేనెక్కే ఆఖరి నిముషం దాకా వాడిని వదల్లేదు. ఒక్కసారిగా కనిపించకుండాపోతే వాడి పరిస్థితేమిటి? ఎంత బెంగగా ఉంటుంది. ఇదాలోచించరేం మీరు? ఎంతసేపూ మీ సరదా, మీ సంతోషం....అంతే! మీకు ముద్దొచ్చినప్పుడూ, మీకు తీరిక ఉన్నప్పుడూ పిల్లాడొచ్చి మీకు సంతో

షన్ని కలిగించాలి. మీకు సమస్యలొస్తే దూరంగా ఉండాలి. కనీసం పిల్లాడికోసమైనా ఫోన్ నెంబర్ ఇవ్వక్కర్లేదా?'' ఆవేశంగా అనేశాడు.

''దీన్నంటారేమిటి మధ్యలో?'' రాజ్యలక్ష్మి కోప్పడింది రాఘవరావు గారి మీద.

''అననివ్వమ్మా! నాన్నేం తప్పుగా అనడంలేదు. ఎంతసేపూ మేం ఇంకా సంపాదించుకోవాలి. సౌకర్యంగా, విలాసవంతంగా బ్రతకాలి అనే ఆలోచించుకున్నాంగానీ మధ్యలో వీడు నలిగిపోతున్నాడనుకోలేదు'' అంది పద్మ ఏడుస్తూ.

''సారీ పద్మా. నిన్నాలని కాదు. ఇలాంటివి ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. ఇప్పుడు మనచేతుల్లో ఏముందో చెప్పు? లక్షకాదు, రెండు లక్షలు ఖర్చుపెట్టినా ఇప్పటికిప్పుడు అతని దగ్గరికి తీసుకెళ్ళి చూపించే వీలులేదు. అతనికేనా వచ్చే వీలులేదు..'' కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుంటూ అన్నాడు రాఘవరావు.

డాక్టర్‌కి ఫోన్ చేస్తే వచ్చి చూశాడు. ఆ రోజుగడిస్తేనే గానీ ఏ సంగతీ చెప్పలేనన్నాడు.

ఉదయ్ తల్లిదండ్రులొచ్చారు. సిద్దూని చూసి ఇద్దరూ బాధపడ్డారు. కోడలిని దగ్గరికి తీసుకుని కంట తడిపెట్టింది ఉదయ్ తల్లి. బల్లిలా మంచాని కతుక్కుపోయిన మనవడ్ని వళ్ళోకి తీసుకుని ఏడ్చింది.

ఉదయ్ తెల్లవారుతుంటే ఫోన్ చేశాడు.

''నువ్వు పంపిన ఈ మెయిల్ ఇప్పుడే చూశాను. ఎలా ఉంది వాడికి? ఒక్కసారి ఫోన్ దగ్గరికి తీసుకురా.'' అన్నాడు పద్మతో.

పద్మ సిద్దూని ఎత్తుకుని ఫోన్ దగ్గరికి తీసికెళ్ళింది. జ్వరతీవ్రతలోనూ, మందుల ప్రభావంవల్ల మత్తులోనూ కూరుకుపోయిన వాడికేం వినిపించలేదు. తల్లి భుజమ్మీద వాలి నిద్రపోతూనే ఉండిపోయాడు. ఉదయ్‌కి అదే చెప్పిందామె.

''అరరే! అంత జ్వరం ఎలా వచ్చింది? సరైన డాక్టర్‌కి చూపిస్తున్నారా? మా అమ్మావాళ్ళకి ఫోన్ చెయ్యకపోయావా?'' ఆదుర్దాగా అన్నాడు.

''వాళ్ళిక్కడే ఉన్నారు'' చెప్పింది.

''నువ్వొచ్చెయ్ ఉదయ్. నాకీ పరిస్థితి బాధనిపిస్తోంది. నువ్వక్కడా, మేమిక్కడా. నీకక్కడ ఉద్యోగం ఉండి ఇంకో నెలకో ఆర్నెల్ళకో మనం కలుసుకుంటే అది వేరే విషయం. ఎంతకాలమిలా?'' పొంగివస్తున్న ఏడుపుని ఆపుకుంటూ అంది.

''నీకు మీ అమ్మావాళ్ళింట్లో బాగా లేకపోతే మా ఇంటికెళ్ళు. అంతేగానీ మతిలేని మాటలు మాట్లాడకు. అంత ఖర్చుపెట్టుకుని ఇక్కడికొచ్చింది అసమర్థుడిలా తిరిగి రావడానికా?'' అని చిరాగ్గా ఫోన్ పెట్టేశాడు.

''ఏమంటాడు?'' పద్మ మామగారు అడిగారు.

''అతన్నొచ్చెయ్యమనండి మామయ్యా! ఉద్యోగం లేకుండా అక్కడెందుకు? ఫ్రెండ్స్ దగ్గరున్నాడు. ఏ ఫ్రెండ్స్ మాత్రం ఎంతకాలం చూస్తారు?'' అంది బ్రతిమాలుతున్నట్టు.

''అక్కడవాడికయ్యే ప్రతిడాలరు ఖర్చూ ఇక్కడ మీ మామగారు ఇండియన్ కరెన్సీలో వాడి ఫ్రెండ్ తండ్రికి లెక్కకట్టి ఇస్తున్నారు'' అంది ఉదయ్ తల్లి.

''మావాటాకొచ్చేదాంట్లోంచి తగ్గించండి'' అంది పద్మ.

''ఇప్పటికే ప్రణయ్, తమ్ముడికి అమెరికా ట్రిప్ పేరు చెప్పి చాలా ఇచ్చారు. మేం ఫ్లాట్ కొనుక్కుంటాం. మాకూ ఐదారులక్షలు ఇవ్వండని తెగనసుగుతున్నాడు. ఉన్నదంతా ఇప్పుడే మీకిచ్చేస్తే మేమేం తినాలి?''

వాళ్లమాటలకి పద్మేకాదు. ఆమె తల్లిదండ్రులు కూడా హతాశులయ్యారు.

ఒకవైపు సిద్దూకిలా ఉంటే ఒక్కరికీ పట్టనట్లు లేదనే బాధ. వాడికేదైనా జరిగితే అంతరాత్మకి జవాబు చెప్పుకోగలమాని గిజగిజలాపోయారు. దాదాపు మూడులక్షలు ఖర్చుచేసి పద్మకి పెళ్ళి చేసిన తను మళ్ళీ ఇంకో అంత ఖర్చుచేసి అల్లుణ్ణి వెనక్కి తీసుకురాగలడా? అని తనకున్న సాధ్యాసాధ్యాల గురించి కూడా ఆలోచించాడు రాఘవరావు. అల్లుడికి అన్న ఉన్నట్టే పద్మకీ చెల్లెలుంది. చిన్న కూతురి పరంగా సమస్యలు ఉత్పన్నమౌతాయనిపించింది. ఇంక ముందుకి ఆలోచించలేదు.



మరి సిద్దూ అంతరంగానికి పెద్దవాళ్ళ నిస్సహాయతే అర్థమైందో మరో అద్భుతం జరిగిందో గానీ జ్వరం దిగింది.

''ఉత్తుత్తి జ్వరానికి మీరు కంగారుపడి మమ్మల్ని హడలుగొట్టారు. ఈపాటిదానికి వాడిని తిరిగొచ్చెయ్యమని గొడవకూడాను. ఇక్కడ ఉద్యోగం వదిలేసి వెళ్ళాడు. తిరిగొస్తే ఏం తింటారు?'' అని విసుక్కుని తిరుగుప్రయాణమయ్యాడు పద్మ మామగారు. ఇంకో రెండురోజులుండి వస్తానంది పద్మ అత్తగారు. అలాగే రెండురోజులుండి సిద్దూ పథ్యం తిన్నాక వెళ్ళిపోయింది.

వారంరోజులు పట్టింది సిద్దూలేచి తిరగడానికి. మృత్యుముఖందాకా వెళ్ళొచ్చిన కొడుకుని చూసి పద్మలో నిర్లిప్తత పేరుకుంది. అది అనుభవించినవాళ్ళకే తెలుస్తుంది. వాడులేచి తిరుగుతున్నాడు. అంతే చాలుననిపించింది.

ఉదయ్ మళ్ళీ ఫోన్ చేశాడు ''తగ్గిందటగా సిద్దూకి? అనవసరంగా అందర్నీ కంగారుపెట్టేసావని నాన్నగారు చెప్పారు'' అన్నాడు.

''ఔనేమో!'' అంది అదే నిర్లిప్తతతోటి. వాడు తన కొడుకు. కాబట్టి తనకి కంగారుంటుంది. తన కొడుకు కాబట్టి తన పేరెంట్స్‌కి ఉంటుంది. ఎక్కడో దూరాన ఉన్న అతనికి వాస్తవం తెలీదు. తను చెప్పిన దానికన్నా అతని పేరెంట్స్ చెప్పినవి చాలా

## బుల్లితెరపై బ్యూటీక్వీన్

**బుల్లితెర విజృంభణ అనంతరం వెండితెర ఇంచుమించు సంక్షోభం అంచున పడినట్టయింది. రోజుకి డజనుకు పైగా సీరియల్స్ ప్రసారం అవుతున్న బుల్లితెరపై నటించాలని ఇప్పుడు నటీనటులు ఉవ్విళ్ళూరుతున్నారు. ఒకప్పటి నటీనటులంతా ఇప్పుడు బుల్లితెరపై నటిస్తూ అందర్నీ అలరిస్తున్నారు. రాధిక, జయసుధ, సుహాసినీ, యమున తరువాత ఇప్పుడు రోజా కూడా ఈ రంగంలోకి ప్రవేశించింది. 'టెలివిజన్ రంగంలో అవకాశాలు బాగున్నాయి. ఎక్కువ మంది టీవీలు చూస్తూ కాలక్షేపం చేస్తున్నారు. కాబట్టి నేను కూడా టీవీ సీరియల్స్‌లో నటించాలనుకున్నాను' అని చెబుతున్న రోజా 'కృష్ణవేణి'గా విస్సా టెలివిజన్‌లో దర్శనమిస్తోంది.**

నమ్మదగ్గవిగా అనిపిస్తాయి.

''నువ్వేంటి? ఆయనతో ఆస్తుల గురించీ, పంపకాల గురించీ మాట్లాడావట? బాగా ఫీలౌతున్నారు...పద్మా! ప్లీజ్ అర్థంచేసుకోవడానికి ప్రయత్నించు. ఇక్కడ నేనుకూడా నిన్నూవాడినీ ఎంత మిస్ చేస్తున్నానో తెలుసా? మిమ్మల్ని వదిలిపెట్టి నేను హేపీగా ఉన్నాననా? ఫ్రెండ్స్‌కి హౌస్‌కీపింగ్ చేస్తూ పాకెట్ ఎక్స్‌పెన్సెస్‌కి సంపాదించుకుంటున్నాను. రాత్రులు పెట్రోల్‌బంక్‌లో చేస్తున్నాను. ఐనా చాలినంత రావడంలేదు. మిగిలినది నాన్న పే చేస్తున్నారు. ఇంతఖర్చుపెట్టీ, శ్రమపడీ వెనక్కి తిరిగిరావడమంత తెలివితక్కువ పని ఇంకొకటుండదు''

**దూరం భారమా?**

**'ఇష్టపడేవారికోసం కష్టపడడంలో తప్పులేదు' ఈ డైలాగ్ ఎక్కడో విన్నట్టుందనుకుంటున్నారా? ఈమధ్య అందాలతార ఐశ్వర్య నోటినుంచి వెలువడిన మాట ఇది. గురిందర్ చద్దా కొత్త చిత్రం 'బ్రైడ్ అండ్ ప్రిజుడిస్' షూటింగ్ ఇప్పుడు లండన్‌లో జరుగుతోంది. ఐస్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ఇప్పుడంతా చర్చనీయాంశం అయింది. లండన్‌లో జరుగుతున్న షూటింగ్‌లో చాలా బిజీగా ఉన్న ఐశ్వర్య ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వివేక్‌ని ఎప్పటికప్పుడు ఫోన్‌లో కాంటాక్ట్ చేస్తూనే ఉంది, దూరం అయినంత మాత్రాన ప్రేమాభిమానాలు తగ్గిపోతాయా? ఏంటి.**

ఎవరు చెప్పాలతనికి. ఎలా చెప్పాలతనికి? ఇరవై నాలుగ్గంటల బిజీ షెడ్యూల్లో అతను తమని మిస్ చెయ్యడానికీ, అతనే లోకంగా పెరిగిన సిద్ధూ పైకి వ్యక్తపరచలేని లేత మనసుతో అతని కోసం బెంగపెట్టుకోవడానికీ తేడా ఉండదు.

''బెంగుళూర్లో ఉన్నడప్పుడెంత హేపీగా ఉండేవాళ్ళం ఉదయ్? అక్కడేదో ఉందనుకుని వెళ్ళావు. మిరేజి అని తెలిసింది. ఇంకా అక్కడెందుకు?''

''కాస్తం మెటీరియలిస్ట్‌గా ఆలోచించలేవా పద్మా? ఒకసారి తిరిగొస్తే మళ్ళీ ఇక్కడికి రాగలనా? కొంత కష్టమైనా ఓర్చుకుంటే ఏదో ఒక జాబ్ దొరకొచ్చు. జావాకి డిమాండ్ పెరుగుతోంది. మార్కెట్ మళ్ళీ ఓపెనైంది''

''మనకున్నది చాలదా? ఇక్కడికొచ్చి మళ్ళీ ఏదో ఒక జాబ్‌లో చేరితే? నేనూ చేస్తాను. ఇద్దరికీ కలిసి ట్వెంటీ వస్తే సరిపోదా?''

''సరిపోవడానికెక్కడికి?'' నవ్వేడతను. ''ముందీ ఖర్చంతా మా నాన్నకి తిరిగివ్వాలి. అయినా ఎంతకాలం ఒకళ్ళ కింద చేస్తాం? మాకు పదిపదిహేనూ ఇస్తూ అక్కడి ఫర్మ్స్ ఎంత దోపిడీ చేస్తున్నాయో తెలుసా?''

''అక్కడ లేదా ఎక్స్‌ప్లాయిటేషను?''

''ఉన్నాగానీ...ఎంత సంపాదించినా ఇండియాలో మిగలదు. అదే ఇక్కడ? నెలకి వెయ్యిడాలర్లు మిగుల్చుకోగలిగితే నలభై వేలకి పైమాటే. అంత మొత్తం అక్కడ మిగల్చడం సాధ్యమేనా? అందుకే కొంత సంపాదించుకుని స్వంతంగా బిజినెస్ చెయ్యాలని''

''మా నాన్న చేసే ఫైనాన్స్ బిజినెస్‌లో రమ భర్తకి ఇంట్రెస్ట్‌లేదు. వాళ్ళు ముంబై వదిలిపెట్టిరారు. నువ్వూ కొంతపెట్టుబడి పెట్టి...'' ఆమె మాటలు పూర్తికానేలేదు. అతను తుంచేశాడు.

''బియ్యే పాసైనవాడిని. వడ్డీవ్యాపారం చెయ్యనా? నోవే...''

పద్మకి ఇంకా అతన్తో వాదించాలనిపించలేదు. రాజ్యమేలరా రాచబిడ్డడా అంటే రాళ్ళెత్తేపనే నాకు బావుంటుందనే వాడితో ఏం చెప్పగలదు? కన్నవాళ్ళనీ, కట్టుకున్నదాన్నీ, తను కన్నవాడినీ అందర్నీ వదిలేసి ఎక్కడో ఇల్లూ వాకిలీ లేకుండా ఇతరుల దయాధర్మం మీద ఆధారపడి ఉంటానంటే ఏం చెయ్యగలదు? పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. వాటిని సరిదిద్దుకోవడంలోనే ఉంటుంది మనిషి విజ్ఞతంతా. డబ్బు సంపాదించాలనుకోవడం తప్పుకాదు. ఇంకా ఇంకా సంపాదించాలనుకోవడం కూడా తప్పుకాకపోవచ్చు. కానీ అందుకు దారులు మూసేసి ఉన్నప్పుడు ఉన్నదాంతో సంతృప్తిపడడమనే మరో దారిలో వెళ్ళడం కూడా తప్పుకాదు.



''సిద్ధూ లేడా అక్కడ? వాడికి పూర్తిగా తగ్గిందా? ఏం చేస్తున్నాడు'' ఉదయ్ అడిగాడు.

పద్మ అక్కడే ఆడుకుంటున్న కొడుకుకేసి తలతిప్పింది. వాడు చేస్తున్నపని ఆశ్చర్యాన్ని కలిగించింది. దాన్ని భర్తకి చెప్పకుండా వుండాలనిపించలేదు.

''వాడిప్పుడు చాలా బిజీగా ఉన్నాడు. అక్కడికెళ్ళేముందు నువ్వు నాకిచ్చిన హేపీ హోం బొమ్మలోంచీ డేడీ బొమ్మని తీసి మూలకి విసిరేశాడు. తర్వాత అమ్మ బొమ్మని చేత్తో పట్టుకుని తదేకంగా చూసి పక్కన పెట్టాడు. ఇప్పుడా ఇంట్లో అబ్బాయి బొమ్మొక్కటే ఉంది. వెంటనే తన చిన్న కుర్చీ తెచ్చుకుని దానికెదురుగా కాలిమీద కాలేసుకుని కూర్చున్నాడు. ఇదంతా చూస్తుంటే నాకేమనిపిస్తోందో తెలుసా?''

''వాడిలా ఎందుకు చేశాడు?''

''అదే చెప్తున్నాను. మనిషి సృష్టించిన డబ్బు మానవ సంబంధాలని వూచకోత కోసేశాక మిగిలి ఉన్న ప్రపంచమనే మహా సమాధికి ఎవరికి వారే సార్వభౌములని...''

''పద్మా! నీ పొయెట్రీ నాకేం అర్థంకావడం లేదు'' అన్న ఉదయ్‌కి జవాబుగా.

''నీ కోసం బెంగపెట్టుకునేవాడు ఒంటరిగా చావుదాకా వెళ్ళొచ్చాడు. తను ఒంటరిగానే వెళ్ళాడన్న విషయాన్ని గుర్తించాడు. నాన్నెక్కడో ఉన్నాడనీ, పక్కనే ఉన్నా అమ్మేమీ చెయ్యలేదనీ కూడా గ్రహించాడు. ఎక్కడో ఉన్న నాన్న, ఏమీ చెయ్యలేని అమ్మ వాడికక్కర్లేదు. వాడి ప్రపంచాన్ని వాడే నిర్మించుకుని, అందులో వాడొక్కడే ఉండాలన్న నిర్ణయాన్ని అన్యాపదేశంగా ప్రకటిస్తున్నాడనుకో...''

''పద్మా''

''సాన్స్ మెచ్యూరిటీ...మనదే''

''ప్లీజ్''

''తల్లీతండ్రీ ఉన్నా లేకపోయినా స్వతంత్రంగా బ్రతకగలిగే పిల్లల ప్రపంచాన్ని మనం సృష్టిస్తున్నాం. నాకింక వాడి విషయంలో ఎలాంటి బెంగా లేదు. నువ్వెప్పుడు తిరిగొచ్చినా...ఇంక నీ ఇష్టం'' అని ఫోన్ పెట్టేసింది.

✪